క్లుప్తంగా

వ్యాపారంలో నిజాయితీ అవసరం



ఉల్లంపర్రు వద్ద పెట్రోలు బంక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు నిజాయితీగా విక్రయిస్తే ఆ వ్యాపారం నూరుశాతం విజయవంతంగా సాగుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పాలకొల్లు–మార్టేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉల్లంపర్రు వద్ద బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు ఏర్పాటు చేసుకున్న శ్రీరామచంద్ర ట్రేడర్స్ పెట్రోల్ బంక్‌ను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్షిత మంచినీటి ప్లాంట్ ప్రారంభం



పెనుమంట్రలో ఉన్న రక్షిత మంచినీటి సరఫరా ప్లాంట్

పెనుమంట్ర: పెనుమంట్రలో రక్షిత మంచినీటి ప్లాంట్‌ను గురువారం పునః ప్రారంభించనున్నట్లు సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక బుధవారం విలేకరులకు తెలిపారు. పెనుమంట్రలో గ్రామీణ మంచినీటి సరఫరా పారిశుద్ధ్యం విభాగం ఆధ్వర్యంలో 2009లో రాజు వేగేశ్న ఫౌండేషన్ నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను అప్పటి సీఎం దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారని, తదుపరి వచ్చిన ప్రభుత్వం ప్లాంట్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించడంతో మూతపడిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన అనంతరం ఈ ప్లాంట్‌కు మరమ్మతులు చేసి గ్రామంతో పాటు పరిసర గ్రామ ప్రజలకు కూడా రక్షిత మంచినీటిని అందించేందుకు ఈ ప్లాంట్‌ను గురువారం నుంచి పునః ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

వీరవాసరం : కొణితివాడలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ మూడో రోజు బుధవారం ఉత్సాహంగా సాగింది. కొణితివాడ, తణుకు, నరసాపురం, ఉండి, తాడేపల్లిగూడెం, ఆచంట జట్ల మధ్య పోటీలు ఆసక్తిగా సాగాయి. ముందుగా సీనియర్ కబడ్డీ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజు భాస్కర్ రాజు, యరకరాజు చినబాబు, గొలగాని సత్యనారాయణ రాజు, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, కనకరాజు హరిబాబు, దుర్గాప్రసాద్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు

పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎస్సై మోహన్‌రావు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నరసింహపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1800 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మోహన్‌రావు చెప్పారు.

కోడిపందేలపై దాడి

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు గ్రామ శివారులో కొందరు కోడిపందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి బుధవారం చెప్పారు. వారి నుంచి రూ.2,200 నగదు, ఒక కోడి, ఒక కత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆకివీడులో పాలకోడేరు అంగన్‌వాడీల విలీనం

ఆకివీడు: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) కార్యాలయంలో పాలకోడేరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్ని విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పాలకోడేరు మండలంలోని 66 అంగన్‌వాడీ కేంద్రాలు భీమవరం సీడీపీఓ పరిధిలో ఉండేవి. వీటిని ఆకివీడు ప్రాజెక్టులో విలీనం చేయడంతో ఆకివీడు ప్రాజెక్టులో ఇప్పటివరకు ఉన్న 195 కేంద్రాలతో కలిపి మొత్తం 261 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 11,468 మంది, గర్భిణులు 1104 మంది, బాలింతలు 1226 మంది ఉన్నారు. పాలకోడేరు మండల పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 3,550, గర్భిణులు 350, 360 బాలింతలకు ఇకపై ఆకివీడు ప్రాజెక్టు నుండి మహిళా, శిశు సంక్షేమ పథకాలు అందనున్నాయి.

గ్రామాల్లో సంక్షేమాభివృద్ధి



చినమల్లంలోని పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మిస్తున్న దృశ్యం



చినమల్లంలో సచివాలయ, ఆర్‌బీకే భవన నిర్మాణాలు



చినమల్లం గరువు రహదారి నిర్మాణ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

- గ్రామాల్లో దర్శనమిస్తున్న నూతన ప్రభుత్వ భవనాలు
- పాఠశాలలతో పాటు ఆర్బీకే, సచివాలయ నిర్మాణాలు

పెనుగొండ: సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న నానుడిని అక్షరాల నిజం చేస్తూ మూడేళ్ల కాలంలో గ్రామాల్లో అభివృద్ధి పరవళ్లు తొక్కిస్తున్నారు. గత ప్రభుత్వాల్లో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చినమల్లంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రత్యేక దృష్టితో గ్రామంలోని సమస్యలు పరిష్కారంతో పాటు గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రభుత్వ పరంగా చేసిన కృషికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల్లో భాగంగా అందించిన సంక్షేమంలో గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు రూ. 9 కోట్లు సంక్షేమ లబ్ధి తొలిసారిగా ప్రతీ కుటుంబం అందుకుంది. కరోనా కష్టకాలంలో సంక్షేమానికి ఆపకుండా అమలు చేయడంతో పేదలు ఇబ్బందులు తప్పాయి. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు నేరుగా వారికి చేరుతుండగా, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రత్యేక కృషితో స్థానిక నాయకులు సహకారంతో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిన చినమల్లం గ్రామంలో ఎంపీయూపీ స్కూలు భవన నిర్మాణం రూ.60 లక్షలతోనూ, రూ.కోటి కి పైగా నిధులతో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. దీంతో పాటు శిథిలావస్థకు చేరి పాఠశాలతో ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీలో రూ.16.27 లక్షలు, మాధవవారి పాలెం స్కూలుకు రూ.5.32 లక్షలతోనూ అభివృద్ధి చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో మురుగు సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలతో డ్రయిన్ నిర్మాణం పూర్తి చేశారు. చినమల్లం గరువు రహదారికి గత ప్రభుత్వాల్లో ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రూ.8 లక్షలతో నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రతీ ఏటా ఎదుర్కొనే నీటి ఎద్దడి నివారణకు రూ.3 లక్షలతో కొత్త బోర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి మూడేళ్ల కాలంలో అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మూడేళ్లలో అభివృద్ధి



గతానికి భిన్నంగా మూడేళ్ల కాలంలో చినమల్లం గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అని నిరూపించారు. ముఖ్యంగా పల్లెల్లో ప్రభుత్వ విద్యకు బలోపేతానికి నిధులు కేటాయించడంతో పాటు, పలు రహదారుల నిర్మాణాలు చేపట్టారు.

– సర్వేశ్ల లాజరస్, న్యాయవాది, చినమల్లం


అభివృద్ధిని చూడాలి



చినమల్లంలో చేపట్టిన అభివృద్ధి కళ్లతో చూడాలి. ఏ ప్రభుత్వం ఇన్ని నిధులు మంజూరు చేయలేదు. కేవలం సంక్షేమమే కాకుండా, శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు దక్కుతుంది. ప్రభుత్వ నిధులే కాకుండా, సొంత నిధులతోనూ మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చినమల్లం గ్రామానికి అండగా నిలిచారు.

– గంధ్రేటి అప్పారావు, ఏఎంసీ డైరెక్టరు, చినమల్లం

వైభవంగా ఉగాది వేడుకలు



పాలకొల్లులో ఉగాది పంచాంగ పఠనం చేస్తున్న వెంకన్న



తూర్పుతాళ్లు గ్రామంలో పండితులను సత్కరిస్తున్న దృశ్యం



జుత్తిగ సోమేశ్వరస్వామివారి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శోభకృత నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు, గోపూజలు చేశారు. లక్ష్మీపార్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా పూలు, పండ్లతో అలంకరించారు. ఆలయంలో స్వామివారి దర్శనం, పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు. సాయంత్రం ఆలయంలో ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో పంచాగ శ్రవణం చేశారు. అనంతరం భక్తులకు 500 పంచాగాలు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే గాయత్రి స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రాకార మండపంలో పురోహితులు ఈవీఎస్ ప్రసాద్ సిద్ధాంతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, పురోహిత సంఘ అధ్యక్షులు మద్దూరి సూరిబాబు, పురోహితులు ఫణి, తనికెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో బుధవారపు వీధి రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గుత్తిన నరసింహమూర్తి పంచాంగ శ్రవణం చేశారు. స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖదారమ్మ ఆలయంలో శృంగవృక్షం దత్తపీఠాధిపతి శ్రీ నాగానంద స్వామీజీ పంచాంగ శ్రవణం చేశారు. స్థానిక చినగోపురం శ్రీ అష్టభుజలక్ష్మీ నారాయణస్వామి ఆలయం, శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ దాసోహాంజనేయస్వామి ఆలయం, శ్రీ శంభన్న అగ్రహారంలో శంభేశ్వరస్వామి ఆలయాల్లో ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

పెనుగొండలో..

పెనుగొండ: శోభకృత్ నామ సంవత్సర ఉగాది ని పెనుగొండ, ఆచంట మండలాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించి తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెనుగొండ, బజారు రామాలయం, చెరుకువాడలోని అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం, పెనుగొండ చెరుకువాడ బ్రాహ్మణ సంఘంలోనూ రామడుగుల నరసింహమూర్తి పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలోనూ, పంచాంగ శ్రవణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శనం చేసుకొన్నారు. ఆచంటలోని ఆచంటేశ్వర స్వామి ఆలయంలోనూ. కొడమంచిలిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఉగాది వేడుకలు నిర్వహించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జుత్తిగ గ్రామంలోని శ్రీఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ముందుగా వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ అర్చకులు దుర్గాదేవికి విశేష కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ఈవో ఒ.సాయి ప్రసాద్, ఆలయ అర్చకుడు సాయిగణేష్‌శర్మ, టీటీడీ వేద పండితులు వేమూరి ఫణీంద్రశర్మ, సర్పంచ్ తమనంపూడి వీర్ పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: శోభకృత నామ సంవత్సరం అన్ని వర్గాల వారికి మంచి జరుగుతుందని ప్రముఖ పండితులు పేర్కొన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ప్రముఖ పండితులు కురెళ్ళ రామచంద్రం, కాళ్ళకూరి అచ్యుతం, చక్రావాధానుల హనుమంతురావు, ఆంజనేయులుతో పంచాంగ శ్రవణాన్ని ఏర్పాటు చేసి అనంతరం ఆలయ చైర్మన్ కోల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులకు వేద ఆశ్వీరచనం అందించి పంచాంగాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ డి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: శ్రీ శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలను మండలంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవార్లు, గ్రామదేవతల ఆలయాలకు భక్తులు చేరుకుని పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. నూతన సంవత్సరంలో కష్టనష్టాలు లేకుండా ఆరోగ్యకరంగా ఉండేలా చూడాలని అమ్మవార్లను కోరుకున్నారు. తూర్పుతాళ్లు గ్రామంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలోని రాజగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ ఆరవెల్లి జగన్నాథాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ఐదుగురు పండితులను సత్కరించారు. వాసవిక్లబ్ జోన్‌3 చైర్మన్ వంకాయల వెంకటకుమార్, క్లబ్ సెక్రటరీ కోట్ల వెంకట సత్యనారాయణ, సభ్యులు పల్లపోతు రాము, పువ్వాడ మారియ, కంచర్ల సోని, కోట్ల సుధాకర్, శిరం శ్రీను, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మత్స్యనారాయణ జయంత్యుత్సవాలు



మొగల్తూరు: పేరుపాలెం కనకదుర్గ బీచ్‌లో ఉన్న శ్రీదశావతార సహిత మత్స్యనారాయణ స్వామి అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మీ అమ్మవార్ల వార్షిక కల్యాణ మహోత్సవాలను ఈ నెల 24 నుంచి 26 వరకు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు 24న మత్స్యనారాయణ జయంతి సందర్భంగా స్వామి వారి విఖానస స్తోత్ర పారాయణం, విష్వక్సేన పూజ,కలశారాధనలు, పంచామృతాభిషేకం, 108 సార్లు మత్స్యగాయంత్రి మంత్రం, 25న ఆదిలక్ష్మి అమ్మవారికి విశేషార్చన,108 తామర పువ్వులతో హోమం,26న శాంతి హోమం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, శృంగవృక్షానికి చెందిన సాయిదత్తనాగానంద సరస్వతి స్వామిజీ వారిచే ఆశీర్వచనం, అనంతరం అన్నసమారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



చెట్టుకింద ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక కుంకమ పూజలో పాల్గొన్న భక్తులు



ఎస్.ఇల్లిందలపర్రులో విశేష పూజలు అందుకుంటున్న దానమ్మవారు

పెనుమంట్ర: మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో శ్రీదానమ్మ అమ్మవారి జాతర, ఉగాది మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి, అనంతరం శ్రీదానమ్మ, శ్రీగోగులమ్మ, శ్రీకనకదుర్గమ్మ అమ్మవార్లను గరగనృత్యాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించి సిరుబండి ఉత్సవాలను, ఊయల సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదానమ్మ అమ్మవారిని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి(వాసు), ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని మొగల్తూరులోని మసీదు వీధిలో ఉన్న పుంతలో ముసలమ్మ, కుక్కల వారి తోటలోని చెట్టుకింద వెలిసిన ముత్యాలమ్మ అమ్మవార్ల జాతరలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెట్టుకింద ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కుంకమ పూజలో పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిథాంలో మరకత శిల వాసవీ మాతను డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరింఆచరు. అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో అభిషేకంలు, పూజలు అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. అలాగే పెనుగొండ శివారు మల్లప్పదిబ్బలోని ప్రసిద్ధ పెద్దింట్లమ్మ ఆలయంలో తీర్థ మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం



పెనుమర్రులో వరికోత యంత్రం నడుపుతున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుంచి రైతులకు అండగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. ఆర్యపేట, పెనుమర్రు గ్రామాల్లోని రైతులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో మంజూరైన పవర్ టిల్లర్స్, వరికోత యంత్రాలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేసే రైతులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం 35 నుంచి 75 శాతం వరకు సబ్సిడీలతో అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, సర్పంచ్‌లు కవురు గోపి, మేడిది విజయ జ్ఞానమణి, పాలంకి శ్రీనివాసరావు, గటిగంటి మహేష్ పాల్గొన్నారు.

దేశ సేవలో యువత చొరవ చూపాలి



ఆర్మీ అధికారి టి సుధీర్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: నేటి యువత దేశ సేవలో పాల్గొనేందుకు చొరవ చూపాలని నెగ్గిపూడికి చెందిన ఆర్మీ ఆఫీసర్ తోలేటి సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని శివుడు కళాసేవ శ్రవంతి ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్టేరు రోటరీ క్లబ్ ఆవరణలో ఉగాది కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సివిల్ ఉద్యోగాలు మాదిరిగా రక్షణ రంగంలో కూడా అందరికి అనువైన విద్యా, వైద్య, ఇంజినీరింగ్ సాంకేతిక రంగాలలో కూడా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలలో సీనియర్స్ విభాగంలో ఎస్.ఇందిరాగాంధీ, కె.మహేశ్వరి, జి.మౌనికాదుర్గ, జూనియర్స్ విభాగంలో వి.నాగఫణేంద్రరెడ్డి, కె.పూర్ణిమ, కె.జయశ్రీసూర్యలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. ఈ సందర్భంగా విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దేశరక్షణలో సేవలు అందిస్తున్న సుధీర్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదిత్య జ్యూయలర్స్ అధినేత కె.వెంకటరెడ్డి, మానవతా సంస్థ అధ్యక్షులు సత్యనారాయణమూర్తి, ఎంవీఆర్ మూర్తి, వేదపండితులు జ్యోష్యుల వెంకటరామం, కొత్త సత్యనారాయణమూర్తి, సంస్థ సభ్యులు ఎల్‌వీఎస్ మూర్తి, ప్రహారరాజు, గౌరీ శంకర్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు చాలా చోట్ల కంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా మార్నింగ్ వాక్ చేసే వారు, సాయంత్రం వేళలో గోదావరి తీరానికి విహారానికి పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టి పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరి జీవితం ఆనందంగా సాగాలి



శ్రీ క్షీరపురి అన్నదాన సమాజం నూతన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు

పాలకొల్లు అర్బన్: శోభకృత్ నామ తెలుగు సంవత్సరం ప్రతీ ఒక్కరి జీవితం ఆనందమయం కావాలని జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని శ్రీ క్షీరపురి అన్నదాన సమాజం నూతన పంచాగాన్ని బుధవారం శ్రీనివాస ఆవిష్కరించారు. కార్యాలయ ఆవరణలో శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ అర్చక స్వామి పూలపల్లి కృష్ణమాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మామిడి వెంకటేశ్వరరావు (బాబు), కార్యనిర్వాహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ, ట్రస్టీలు శిడగం రమణ, ఆధ్యాత్మికభట్టర్ ఆళ్వార్, ముద్దాల ధనలక్ష్మీ దుర్గాప్రసన్న, వింజరపు శంకరం, గుండుబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో సత్కారం అందుకున్న కవులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షత్రియ కళ్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ పరిషత్, రసధుని సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉగాది సాహితీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పలువురు కవులు చక్కటి వ్యాఖ్యానాలతో సభికులను అలరించారు. ముందుగా వి.కె సత్యనారాయణ పంచాగ శ్రవణం చేశారు. అనంతరం సమ్మేళనంలో పాల్గొన్న కోలాటి పెద్దిరాజు, చేగొండి రంగారావు, వివిఎస్ఎన్ రాజు, పిఎస్‌వివి శ్రీదేవి, ఎస్‌కె నాగేశ్వరరావు, గాదరాడ రవిచంద్ర, ఏడిద కవీంద్ర, మంకు శ్రీను, పులపర్తి శ్రీనివాస్ తదితర కవులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు, సభ సంచాలకులు కవి మామిడిశెట్టి శ్రీనివాసరావు, ముఖ్య అతిథులు పి. లక్ష్మీనారాయణ, భూపతిరాజు విశ్వనాథరాజు, కెఎస్‌పిఎస్ వర్మ, కలిదిండి వెంకట కృష్ణవర్మ, యర్రంశెట్టి వెంకటరత్నం, సివివి సత్యనారాయణమూర్తి, వలవల శ్రీరామమూర్తి, నవత భాస్కరరావు, సిహెచ్ అన్నపూర్ణేశ్వరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవురు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

వీరవాసరం : ఆధ్యాత్మిక భావన ద్వారా శాంతి సమాజం ఏర్పడుతుందని జిల్లా పరిషత్ జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. తోలేరులోని శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోనూ, నవుడూరు జంక్షన్‌లోని శ్రీ పద్దాల అంకమ్మ వారి ఆలయంలోనూ బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక హోమాలు, అభిషేకాలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనాన్ని గడపాలని ప్రార్థించారు. ఆయా కార్యక్రమాల్లో చావ్వాకుల సత్యనారాయణమూర్తి, పెన్మత్స సూర్యనారాయణ రాజు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, కలిదిండి సూరిబాబు పాల్గొన్నారు.